ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

## పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్


తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -46 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 5 జూన్ 2026

# బీచ్ షాక్స్ పాలసీ
## కేబినెట్ ఆమోదం



- అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం
- వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే అమలు
- భీమిలీ తదితర బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- క్వాంటమ్ వ్యాలీ భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు
- ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం
- కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు
- ఎపి కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి,జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా **మిగతా 2లో...**



## ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి..

**టీడీపీకి 3, జనసేనకు 1**

- ఈసారి బీజేపీకి దక్కని రాజ్యసభ అవకాశం
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో తుది నిర్ణయం
- జూన్ 18న నాలుగు స్థానాలకు జరగనున్న పోలింగ్

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు. మిగతా 2లో...

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలి

### రేపు కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన

- అదే రోజు భారత్ కు వస్తున్న సీజేపీ వ్యవస్థాపకుడు
- ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాకు ఏర్పాట్లు
- జెన్ జెడ్ యువతరంకదిలిరావాలంటూ పిలుపు -భారీ పోలీసు బందోబస్తు




**న్యూఢిల్లీ జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. నీట్, సీబీఎస్ఈ పరీక్షల వివాదాలు, జెఈఈ (అడ్వాన్స్‌డ్) 2026 అభ్యర్థుల డేటా బహిర్గతానికి కేంద్రమే కారణమని ఆరోపిస్తున్న సీజేపీ, రేపు (శనివారం) ఆందోళన చేపట్టనుంది. గురువారం నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, **మిగతా 2లో...**

## రూ.15లక్షల కోట్ల మాయాజాలం..

- రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ స్కాం..
- రెవెన్యూలో భారీ అక్రమాలు?
- 99 శాతం తప్పుడు ఆదాయమే
- అవకతవకలపై సెబీ 109 పేజీల నివేదిక



**ముంబయి :జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
ప్రముఖ బంగారం, ఆభరణాల తయారీ దిగ్గజం రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఆర్‌ఈఎల్) భారత కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద రెవెన్యూ కుంభకోణానికి పాల్పడింది. సత్యం కంప్యూటర్స్‌ను మించిన అవకతవకలకు పాల్పడిందని స్పష్టమవుతోంది. ఆర్‌ఈఎల్ ఏకంగా రూ.15.15 లక్షల కోట్ల ఆదాయాన్ని ఎక్కువ చేసి చూపింది. రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ రెవెన్యూ మోసాలపై సెబీ విడుదల చేసిన 109 పేజీల నివేదికపై **మిగతా 2లో...**

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!
- 2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన



**న్యూఢిల్లీ,జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి.

ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. **మిగతా 2లో...**




## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

- మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు
- సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ,జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను మిగతా 2లో...




## శ్రీసిటీలో రైల్వే రోలింగ్ మిల్లు..

### రష్యా దిగ్గజానికి లోకేష్ కీలక ప్రతిపాదనలు

- రష్యా పర్యటనలో నోవోస్టల్-ఎం చైర్మన్‌తో మంత్రి లోకేష్ సమావేశం
- భారత్‌లో అత్యాధునిక ఈఏఎఫ్ స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విజ్ఞప్తి
- ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు వైర్ ఫ్యాక్టరీ నిర్మాణంపై చర్చ
- లోకేష్ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్న నోవోస్టల్ చైర్మన్

**జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్, తన పర్యటనలో మూడో రోజు కీలక సమావేశం నిర్వహించారు. రష్యాకు చెందిన ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ 'నోవోస్టల్-ఎం' చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో భేటీ అయ్యారు. భారత్‌లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, పలు కీలక ప్రతిపాదనలు ఆయన ముందుంచారు. **మిగతా 2లో...**

## పాలమూరు ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

- పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సిఎం
- ప్రాజెక్టుల స్థితిగుతలపై అధికారులతో ఆరా




**మహబూబ్‌నగర్,జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు.

జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. **మిగతా 2లో...**

## యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా



### దేశానికి యువతే ప్రాణం

- ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి
- జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలు
- నియమించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

**అమరావతి,జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం **మిగతా 2లో...**

# కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

అధికార ప్రతినిధులు విజయేత దహియా, అశుతోష్ రాంకా మాట్లాడుతూ తమ ఆందోళన హింసాత్మకంగా మారవచ్చనే ఊహాగానా లను తోసిపుచ్చారు. శాంతియుత నిరసన చేపట్టేందుకు నిబద్ధతతో ఉన్నామని పునరుద్ఘాటించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండింటితోనూ చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. "హింస చెలరేగుతుందని వదంతులు వ్యాపిస్తున్నాయి. సీజేపీ శాంతిభద్రతలకు అనుగుణంగా శాంతియుత, ప్రజాస్వామ్యయుత నిరసనలకు పిలుపునిస్తోంది. హింసకు తావులేదు" అని ఆయన అన్నారు. ఫలితాల పోర్టల్‌లో క్లౌడ్ స్టోరేజ్ కాన్ఫిగరేషన్ సమస్య కారణంగా జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2026 అభ్యర్థుల డేటా బహిర్గతమైందన్న వార్తలు, దేశ విద్యా వ్యవస్థను, డిజిటల్ మౌలిక సదుపా యాలను ఎంత "అసమర్థ" వ్యక్తులు నడుపుతున్నారో చూపిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల డేటా భద్రత, పరీక్షా విధానాలను ప్రభుత్వం నిర్వహించే తీరుపై కొత్త ఆందోళనలను రేకెత్తించిందని అన్నారు. అభ్యర్థుల సమాచారం బహిర్గతం కావడం సైబర్ సెక్యూరిటీ భద్రతల దుస్థితిని ప్రతిబింబిస్తోందని అన్నారు. "దాదాపు రెండు లక్షల మంది విద్యార్థుల పేర్లు, ఫోన్ నంబర్లు, చిత్రాలు బహిర్గతమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి టెక్నాలజీ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న టెక్ నిపుణులను అందించిన దేశంలో, విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వం కనీస వ్యవస్థలను కూడా సురక్షితంగా నడపలేనంత అసమర్థంగా ఉన్నాయి" అని రాంకా అన్నారు. విద్యా రంగంలో జవాబుదారీతనాన్ని నిర్ధారించడంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విఫలమయ్యారని, ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. "విద్యాశాఖ మంత్రి పూర్తిగా అసమర్థుడు. ఆయన విద్యా వ్యవస్థను నాశనం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలని మేము ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఇది మన విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం, దీనివల్ల చాలా నష్టం వాటిల్లుతుంది" అని ఆయన అన్నారు. ప్రభుత్వ సంస్థలకు శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక నైపుణ్యం ఉన్న వ్యక్తులు అవసరమని కూడా అన్నారు. "ఆ డేటా రీడ్-ఓన్లీ అని ఐఐటీ రూర్కీ చెప్పింది. ఇదేమైనా జోకా? దాన్ని చదవొచ్చు కానీ ఎడిట్ చేయలేమని చెబుతున్నారా? ఒక సాధారణ ఐఐటి పోర్టల్‌ను కూడా సురక్షితంగా నడపలేరు. 16, 17, 18 ఏండ్ల కుర్రాళ్లు లోపాలను కనుగొని సీఈఆర్టీకు తెలియజేస్తున్నారు. ఇది వ్యవస్థను నడుపుతున్న వారి సామర్థ్య స్థాయిని చూపిస్తుంది" అని ఆయన అన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణలో జరిగిన అన్ని డేటా బహిర్గత ఘటనలు, సైబర్ సెక్యూరిటీ లోపాల వివరాలను వెల్లడించాలని రాంకా డిమాండ్ చేశారు. "ఈ దేశ డేటా ఎక్కడెక్కడ చేరిందో, దానికి ఎవరెవరికి యాక్సెస్ ఉందో మేము తెలుసుకోవాల నుకుంటున్నాము. ఇటువంటి ఉల్లంఘనలన్నింటి వివరాలను, ముఖ్యంగా జాతీయ భద్రతపై ప్రభావం చూపే వాటిని బహిరంగపరచాలి" అని ఆయన అన్నారు.

**రేపు ఢిల్లీకి సీజేపీ వ్యవస్థాపకుడు**

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జూన్ 6న ఢిల్లీకి చేరుకుని, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి కోరనున్నారని అన్నారు. ప్రతిపాదిత ఈ ప్రదర్శనలో పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా పాల్గొంటారని తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులు రాజకీయ బ్యానర్లు లేకుండా ఈ ఉద్యమంలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం ఇతివృత్తం యువతకు సంబంధించినదని ఆయన అన్నారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే మా ఏకైక డిమాండ్" అని దాస్ అన్నారు. సీజేపీ జవాబుదారీతనం కోరుతున్న యువ రాజకీయ ఉద్యమమని ఆయన నొక్కి చెప్పారు. నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఆన్-స్క్రీన్ మార్కింగ్ అవకతవకలు, ఇతర సంబంధిత సమస్యలకు ప్రధానే కారణమని అన్నారు.

# రూ.15లక్షల కోట్ల మాయాజాలం..

**మొదటిపేజీ తరువాయి**

భారత కార్పొరేట్ రంగంలో తీవ్ర చర్చకు దారి తీసింది. 2020-21 నుండి 2024-25 ఆర్థిక సంవత్సరాల మధ్య కంపెనీ తన ఏకీకృత ఆదాయాన్ని ఏకంగా రూ.15.15 లక్షల కోట్లు ఎక్కువగా చూపించిందని సెబీ ప్రాథమిక విచారణలో తేల్చింది. కంపెనీ పుస్తకాల్లో నమోదైన మొత్తం గ్రూప్ ఆదాయంలో ఇది దాదాపు 97 శాతం నుంచి 99 శాతం వరకు అధిక రెవెన్యూ ఉండటం గమనార్హం. సత్యం కంప్యూటర్స్ కుంభకోణం తర్వాత.. ఇంత భారీ స్థాయిలో రెవెన్యూను తప్పుగా చూపించడం భారత కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత అసాధారణమైన ఘటనాగా ఆర్థిక విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

**స్విస్ అనుబంధ సంస్థతో మాయాజాలం**

ఈ ఆదాయాల వ్యత్యాసాల వెనుక ప్రధానంగా ఆర్ఈఎల్ కంపెనీకి చెందిన విదేశీ అనుబంధ సంస్థల పాత్ర ఉన్నట్లు సెబీ గుర్తించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫైనరీ అయిన స్విట్జర్లాండ్‌కు చెందిన వాల్కాంబిని రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ 2015లో కొనుగోలు చేసింది. అయితే.. ఈ స్విస్ సబ్సీడరీ స్వతంత్ర ఆడిట్ నివేదికల్లోని వార్షిక ఆదాయానికి, రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ గ్రూప్ లెక్కల్లో చూపించిన ఆదాయానికి మధ్య ఏమాత్రం పొంతన లేదని సెబీ స్పష్టం చేసింది. వందల కోట్ల ఆదాయాన్ని లక్షల కోట్లుగా ఎలా మార్చారనే దానికి.. కస్టమర్ల వివరాలు లేదా ఇన్‌వాయిస్‌ల వంటి ఎలాంటి బలమైన ఆధారాలను కంపెనీ సమర్పించలేకపోయింది.

**వ్యక్తిగత ట్రేడింగ్‌లు.. నిధుల మళ్ళింపు**

ఆదాయాన్ని పెంచి చూపడమే కాకుండా కంపెనీలో తీవ్రమైన కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలు, నిధుల మళ్లింపు జరిగినట్లు సెబీ గుర్తించింది. కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాల ద్వారా దాదాపు రూ.11,487 కోట్ల విక్రయాలు, రూ.11,488 కోట్ల కొనుగోళ్లతో కూడిన డెరివేటివ్ లావాదేవీలను నిర్వహించారు. ఈ భారీ లావాదేవీలను నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ బుక్‌లలో బిజినెస్ ట్రేడింగ్‌గా చూపించారు. అలాగే బోర్డు లేదా ఆడిట్ కమిటీ ముందస్తు అనుమతులు లేకుండానే కంపెనీ నిధులను ప్రమోటర్ల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల ద్వారా మళ్లించినట్లు తెలుస్తోంది.

**ఒక మెయిల్‌లో వెలుగులోకి..**

రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ ఆర్థిక అక్రమాల వెనుక ఉన్న అసలు రహస్యాలు ఒక సాధారణ ఇన్వెస్టర్ పంపిన ఈ మెయిల్‌తోనే వెలుగులోకి వచ్చాయి. 2025 మార్చి 11న సెబీ ఇన్‌బాక్స్‌కు ఒక సాధారణ వాటాదారు పంపిన ఫిర్యాదులో.. కంపెనీ ఖాతాల్లో కస్టమర్ల నుంచి రావాల్సిన బకాయిలు ఏళ్ల తరబడి ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయనే సాంకేతిక అంశాన్ని లేవనెత్తారు. దీనిపై స్పందించిన సెబీ అక్టోబర్ 2024న దర్యాప్తు అధికారిని, డిసెంబర్ 2024న బిడిఓ ఇండియాను ఫోరెన్సిక్ ఆడిటర్‌గా నియమించింది. ఆడిట్ సంస్థకు కంపెనీ యాజమాన్యం తమ ప్రధాన ఇఆర్‌పి సిస్టమ్స్ పరిశీలించడానికి అనుమతించకపోవడంతో పాటు.. రూ.7,000 కోట్లకు పైగా శాంపిల్ లావాదేవీలలో కేవలం చిన్న మొత్తానికి మాత్రమే ఆధారాలు చూపడంతో సెబీ రంగంలోకి దిగింది. 2025 అంతటా వరుస సమన్లు జారీ చేసిన సెబీ తాజాగా బుధవారం తన రిపోర్ట్‌ను బయటపెట్టింది. విచారణకు సహకరించని యాజమాన్యం. సంస్థపై వచ్చిన ఆరోపణలపై విచారిం చడానికి రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ సహకరించలేదు. యాజమాన్యం ప్రధాన ఇఆర్‌పి అకౌంటింగ్ సిస్టమ్స్‌ను పరిశీలిం చడానికి ఆడిటర్లను అనుమతించలేదని, కీలక పత్రాలను దాచిపెట్టి విచారణకు ఏమాత్రం సహకరించలేదని సెబీ స్పష్టం చేసింది. కీలక ఆర్థిక పత్రాలను దాచిపెట్టి దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా అడ్డుకుందని సెబీ తన నివేదికలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

**మార్కెట్‌లో ప్రకంపనలు**

ఈ తీవ్రమైన ఆర్థిక అవకతవకల నేపథ్యంలో సెబీ తక్షణ చర్యలు చేపట్టింది. కంపెనీ ప్రమోటర్ రాజేష్ మెహతా షేర్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేయకుండా నిషేధం విధించింది. అలాగే కంపెనీపై కొత్తగా సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశించింది. ఈ వార్త వెలువడిన వెంటనే స్టాక్ మార్కెట్‌లో రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ షేర్లు భారీగా పతనమై 5 శాతం లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. మార్కెట్లో హాట్‌టాపిక్‌గా మారి ప్రకంపనలు సృష్టించింది. మరోవైపు ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీకి ఈ కంపెనీలో 10.8 శాతం వాటా ఉండటంతో ఇన్వెస్టర్లలో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రభుత్వ నిధులు, సాధారణ ఇన్వెస్టర్ల పెట్టుబడుల భద్రతపై మార్కెట్ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవు తోంది. మరోవైపు ఈ ఆరోపణలను రాజేష్ మెహతా తోసిపుచ్చుతూ తాము త్వరలోనే చట్టపరంగా వివరణ ఇస్తామని పేర్కొన్నారు.

# బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన




భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. రాష్ట్రంలో రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్ ఏర్పాటుకు 30 ఏళ్ల లీజు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయిం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

# కేరళను తాకిని నైరుతి రుతుపవనం

**తిరువనంతపురం,జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**

ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ



అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్-సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి..

**మొదటిపేజీ తరువాయి**

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. ఈ భేటీలో మిత్రపక్ష నేతలతో చర్చించిన అనంతరం, సీట్ల కేటాయింపు నిర్ణయాన్ని సీఎం స్వయంగా వెల్లడించారు. మూడు పార్టీల నేతల ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే రాజ్యసభ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగానే ఈ కేటాయింపులు జరిపినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీలో టీడీపీకి భారీ మెజారిటీ ఉండగా, జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 18న నాలుగు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి ఉన్న పూర్తి ఆధిక్యతతో ఈ నాలుగు స్థానాలనూ గెలుచుకోవడం లాంఛనప్రాయమే.కాగా, నేటి ఎన్డీయే సమావేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 9న తిరుపతిలో 'సంక్షేమం', 12న అమరావతిలో 'సుపరిపాలన', 15న విశాఖపట్నంలో 'అభివృద్ధి' అనే అంశాలపై సభలు జరపాలని చంద్రబాబు సూచించారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

**మొదటిపేజీ తరువాయి**

ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారంనిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

**మొదటిపేజీ తరువాయి**

నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

# పాలమూరు ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాత్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.

# శ్రీసిటీలో రైల్వే రోలింగ్ మిల్లు..

**మొదటిపేజీ తరువాయి**

భారత్‌లో ప్రస్తుతం పారిశ్రామిక వాతావరణం అత్యంత అనుకూలంగా ఉందని లోకేష్ తెలిపారు. పర్యావరణ అనుమతులు వేగంగా లభిస్తున్నాయని, మౌలిక సదుపాయాల మార్కెట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని, అత్యుత్తమ శ్రేణి రీబార్, వైర్ రాడ్‌లను తయారుచేసే అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (ఈఏఎఫ్) స్టీల్ ప్లాంట్‌ను భారత్‌లో నిర్మించాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో తక్షణ రైల్వే సైడింగ్ కనెక్టివిటీతో కూడిన స్ట్రక్చరల్ సెక్షన్, రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని కోరారు. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు నేరుగా ముడిసరుకు అందించేందుకు ప్రత్యేకమైన హార్డ్‌వేర్ గాల్వనైజ్డ్ వైర్ ఫ్యాక్టరీని నిర్మించాలని సూచించారు. వీటితో పాటు, ముడి పదార్థాల లాజిస్టిక్స్ హబ్‌ను అభివృద్ధి చేయడానికి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని, తక్కువ కర్బన ఉక్కు తయారీలో భాగస్వాములు కావాలని ప్రతిపాదించారు.లోకేష్ ప్రతిపాదనలపై నోవోస్టల్-ఎం చైర్మన్ ఇవాన్ డెమ్చెంకో సానుకూలంగా స్పందించారు. తమ సంస్థ ఏటా 2.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తూ, 60కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తోందని వివరించారు. తమ మార్కెట్ విస్తరణలో భాగంగా భారతదేశ నిర్మాణ, ఉత్పాదక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇప్పటికే జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు ముడిసరుకు అందిస్తున్నామని, ముంబై, చెన్నై వంటి నగరాల్లో పంపిణీ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆకర్షణీయంగా ఉన్నాయని, వాటన్నింటినీ తమ బోర్డుతో చర్చించి, క్షుణ్ణంగా పరిశీలిస్తామని డెమ్చెంకో హామీ ఇచ్చారు. ఈ భేటీతో ఏపీకి మరో భారీ పెట్టుబడి మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది.

# యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా

**మొదటిపేజీ తరువాయి**

'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నియమించారు. జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న పక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని అధినేత చెప్పుకొచ్చారు. 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా కసరత్తు చేస్తున్నామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కేడర్ ఆధారిత నాయకత్వ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని పరిశీలించి పార్టీ బాధ్యతల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# డీఎస్సీ నియామకాలపై అవాస్తవ ప్రచారాలు మానుకోవాలి

## : వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ

**దేవనకొండ జూన్ 4( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ పార్టీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు తమ ప్రతిభ, కష్టం, పట్టుదలతో ఉద్యోగాలు సాధించారని, వారి విజయాలను రాజకీయ కోణంలో చూడడం సమంజసం కాదన్నారు. కూలీ, రైతు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎన్నో త్యాగాలు చేసి, కష్టపడి చదివి ఈ విజయాలను అందుకున్నారని ఆమె తెలిపారు. ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించారని, ప్రతిభ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరిగిందని స్పష్టం చేశారు. ఉద్యోగాలు సాధించిన యువత శ్రమను గౌరవించాలని, ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థి విజయం వెనుక వారి కుటుంబాల త్యాగాలు, నిరంతర శ్రమ ఉన్నాయని గుర్తు చేశారు. "ఉద్యోగాలు ఎవరి దయా దాక్షిణ్యాలతో రావు. కష్టపడి చదివిన వారి ప్రతిభకు లభించిన గుర్తింపే ఈ ఉద్యోగాలు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన ప్రతి యువకుడు, యువతి గర్వపడేలా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించింది. వారివిజయాలను అభినందించాలి గానీ, అవాస్తవ ప్రచారాలతో వారి ఆత్మ విశ్వాసాన్నిదెబ్బతీయకూడదు"అని కప్పట్రాల్లా బొజ్జమ్మ పేర్కొన్నారు.

# ఉద్యోగాలు అభ్యర్థుల యొక్క ప్రతిభ, కష్టానికి లభించిన ఫలితం

## డీఎస్సీ నియామకాలు పూర్తిగా పారదర్శకంగా జరిగాయి.

**దేవనకొండ జూన్ 4( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**




రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాల ద్వారా మా కప్పట్రాల్ల గ్రామంలోనే 7 మంది ఉద్యోగాలు సాధించడం ఆనందకర విషయం. ఫ్యాక్షన్ ప్రభావం ఎక్కువగా ఉన్న గ్రామం నుంచి కూడా యువత కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తున్నారని ఇది నిరూపిస్తోంది.

మా కష్టం మాకుటుంబాలకు అండగా నిలుస్తుంది. కూలీ జీవితాల నుంచి వచ్చి, ఎన్నో కష్టాలు ఎదుర్కొని, రాత్రింబవళ్లు శ్రమించి ఈ స్థాయికి చేరుకున్నాం. మా ఉద్యోగాలు ఎవరి దయా దాక్షిణ్యాల వల్ల వచ్చినవి కావు; మా ప్రతిభ, మా శ్రమ, మా పట్టుదల వల్ల వచ్చినవి. ప్రతిభకు రాజకీయ రంగులు పులమడం సరైంది కాదు. డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం, ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించారు. అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పిస్తూ పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. అయితే కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరం. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టం, పట్టుదలను తక్కువ చేసి చూపించడం వారి శ్రమను అవమానించినట్టే. విజయం సాధించిన ప్రతి అభ్యర్థి వెనుక ఎన్నో త్యాగాలు, ఎన్నో నిద్రలేని రాత్రులు, ఎన్నో ఆశలు ఉంటాయి. వాటిని గౌరవించడం మన బాధ్యత. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలి గానీ, అవాస్తవ ప్రచారాలతో సమాజంలో అపోహలు సృష్టించడం మంచి పద్ధతి కాదు. "మా ఉద్యోగం మా ప్రతిభకు వచ్చిన గుర్తింపు. మా కష్టం, మా చదువు, మా పట్టుదలే మాకు ఈ విజయాన్ని అందించాయి."

# మొక్కలు నాటండి...పర్యావరణాన్ని పరీక్షించండి

## ఎన్జీఓ ఆధ్వర్యంలో ర్యాలీ




**పెద్ద వడుగూరు జూన్ 04 రిపబ్లిక్ న్యూస్**

పెద్దవడుగూరు మండల లో గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని సుమంత్ ఎన్విరాన్మెంటల్ రూరల్ అగ్రికల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మండల అధికారులు పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని ప్రజలకు వివరించారు. పర్యావరణ పరి రక్షణ కోసం ఆటవిసంపద పెంచాలని, విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మండల విద్యాశాఖ అధికారి గురు ప్రసాద్ పిలుపునిచ్చారు. హౌసింగ్ ఏఈ నెట్టికంటయ్య మాట్లాడుతూ భూమిలో కరగని ప్లాస్టిక్ వాతావరణానికి ముప్పు తెస్తుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడం మంచిదని హితవుపలికారు. సుమంత్ ఎన్విరాన్మెంట్ సొసైటీ అధ్యక్షుడు వై. రామాంజనేయులు మాట్లాడుతూ మన నిర్లక్ష్యం వల్ల ఉన్న చెట్లను నరికి, కొత్తగా మొక్కలు నాటకపోవడంతో వాయు, ధ్వని, నీటి కాలుష్యం పెరిగి అనేక రకాల అనారోగ్యాలకు గురికావడం జరుగుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఇంకా జన చైతన్య యువజన సంఘం కార్యదర్శి వెంకటరమణ, వివేకానంద యువజన సంఘం సూర్యనారాయణ, రంగ యువజన సంఘం రంగనాథ్ తదితరులు మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం వల్ల ఎన్నో అనర్థాలు వస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని, అధికంగా బీడుభూములు, బోడి కొండలలో మొక్కలు నాటాలని ,అదే విధంగా ప్రతి ఇంటిముందు ఒక మొక్క నాటడం అందరి బాధ్యత అని గుర్తుచేశారు.

# టీడీపీ మోసపూరిత హామీలపై వైయస్సార్సీపి నిరసన

**గుత్తి జూన్ 04 రిపబ్లిక్ న్యూస్**



గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ యందు గురువారం వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని నిరసన వ్యక్తం చేస్తూ, టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# గ్రామం నుంచి గ్లోబల్ స్థాయికి..

## గట్టు వెంకట రాముడికి వైవీయూ డాక్టరేట్

### కె. వెంకటాపురం యువకుడికి యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం

**దేవనకొండ, జూన్ 4( ప్రజా రిపబ్లిక్ న్యూస్):**






దేవనకొండ మండలం కె. వెంకటాపురం గ్రామానికి చెందిన యువ పరిశోధకుడు గట్టు వెంకట రాముడుకు యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన గట్టు వీరన్న, లక్ష్మీ దంపతుల కుమారుడైన వెంకట రాముడు సాధించిన ఈ ఘనత గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది.

అనువర్తిత గణిత శాస్త్ర విభాగంలో ఆచార్య గంద్రకోట కాత్యాయని పర్యవేక్షణలో "ఎనాలిసిస్ అఫ్ ఫ్లో అండ్ హీట్ ట్రాన్స్ఫర్ ఇన్ వారియస్ జియోమెట్రిక్ ఎంక్లోసూరీస్ " అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు ప్రకటించారు.

గట్టు వెంకట రాముడు చేసిన పరిశోధనలకు సంబంధించిన నాలుగు వ్యాసాలు స్కోపస్ , వెబ్ అఫ్ సైన్స్ , సైన్స్ గుర్తింపు పొందిన అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధనలు ఆటోమొబైల్, రసాయన, ఎలక్ట్రానిక్స్ తయారీ, బయోమెడికల్ ఇంజనీరింగ్ వంటి రంగాల్లో ఉపయోగకరంగా ఉండనున్నాయి. ఇదే విశ్వ విద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసిన వెంకట రాముడు, ఏపీసెట్, టీజీసెట్, కేసెట్ వంటి ప్రతిష్టాత్మక అర్హత పరీక్షల్లో కూడా విజయాలు సాధించారు. కె. వెంకటాపురం గ్రామ చరిత్రలో తొలి డాక్టరేట్ గ్రహీతగా నిలిచిన ఆయనను కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, మిత్రులు, గ్రామస్తులు ఘనంగా అభినందించారు.

కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని గట్టు వెంకట రాముడు మరోసారి నిరూపించారు.

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపు లక్ష్యంగా సిటీ స్థాయి ఎన్విరాన్మెంటల్ క్విజ్ పోటీలు

### ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభం





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 4)**

కర్నూలు నగరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని సిటీ స్థాయి ఎన్విరాన్మెంటల్ క్విజ్ పోటీలు ప్రారంభమయ్యాయి.

నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ గనులు మరియు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తాళ్లపాక నటరాజ్ హాజరై మాట్లాడారు. ప్రతి వ్యక్తీ పర్యావరణ పరిరక్షణలో తన బాధ్యతను గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. నీటిని ఆదా చేయడం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం వంటి అలవాట్లు ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

లీగల్ సర్వీసెస్ మెంబర్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డా. రాయపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చన్నారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు లయన్ మురారి శంకరప్ప మాట్లాడుతూ వాహనాల అధిక వినియోగం కారణంగా వాతావరణ కాలుష్యం పెరిగి గ్లోబల్ వార్మింగ్‌కు దారితీస్తోందని తెలిపారు.

క్విజ్ పోటీల నిర్వాహకులు మాస్టర్ లయన్ కె.డి.జె. బాబు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తాసిల్దార్ ఓరి, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి రాయపాటి నాగలక్ష్మి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.180 కోట్లతో అభివృద్ధి దిశగా అనంత ఎమ్మెల్యే దగ్గుపాటి

### నూతన ధ్యాన యోగ కేంద్ర పార్కుకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

### పాల్గొన్న ఆర్డిటి నిర్వాహకులు మాంచో ఫెర్రర్ -ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ యోగా, జ్ఞాన కేంద్రంగా నామకరణం





**అనంతపురం సంక్షేమం, జూన్ 04, (రిపబ్లిక్ న్యూస్):**

164 స్థానాలు గెలిచి ఒక సువర్ణాధ్యాయం లిఖించిన రోజుగా.. జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో మిగిలిపోతుందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అలాంటి ఒక ముఖ్యమైన రోజు ఎప్పటికీ గుర్తుండే విధంగా అనంతపురం నగరంలోని శారద నగర్ లో ధ్యాన, యోగ కేంద్రానికి భూమి పూజ చేశారు. శారద నగర్ లోని రెండవ క్రాస్ లో రూ.50 లక్షలతో ఈ ధ్యాన కేంద్రాన్ని నిర్మించ తలపెట్టారు. ఈ ధ్యాన కేంద్ర నిర్మాణానికి జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో పాటు ఆర్డిటి నిర్వాహకులు మాంఛో ఫెర్రర్ , మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**ఆర్డిటి సంస్థ జిల్లాలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని అందుకు గుర్తుగా ఈ ధ్యాన యోగా కేంద్ర నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. శారద నగర్ లో ఈ ధ్యాన యోగా కేంద్రం ప్రారంభించాలని చాలా రోజుల నుంచి విజ్ఞప్తి చేస్తున్నారని.. అయితే గత ప్రభుత్వం దీనిని పక్కన పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇందుకోసం నిధులు తీసుకొచ్చి నిర్మాణం ప్రారంభించామన్నారు. ఆర్డిటి సంస్థ జిల్లాలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తుగా అలాగే శారద నగర్ ప్రాంతంలోనే, ఆర్డిటి కార్యాలయం ఉన్న నేపథ్యంలో ఈ ధ్యాన యోగా కేంద్రానికి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ గారి పేరును పెడుతున్నట్లుగా చెప్పారు. జిల్లాలో ప్రభుత్వంతో సమానంగా అన్ని వర్గాలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్న గొప్ప సంస్థ ఆర్డిటి అని అన్నారు. ఆ సంస్థ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందని... అందుకే ఈ కేంద్రానికి ఫాదర్ పేరు పెట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నగరంలో 180 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చాలా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ రెండేళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వివరించారు. రాష్ట్రానికి 25 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షలకు పైగా ఉద్యోగాలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ గారికే దక్కుతుందని దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు..


# మహిళల భద్రత, రక్షణ కోసం ప్రతి ఒక్కరూ

# బాధ్యతగా వ్యవహరించాలి



## కోడుమూరు లో "ఆపరేషన్ దండయాన" పోస్టర్ల ఆవిష్కరణ






**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 4)**
మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, మహిళల భద్రతను బలోపేతం చేయడం మరియు చట్టాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు చేపట్టిన "ఆపరేషన్ దండయాన" కార్యక్రమంలో భాగంగా కోడుమూరులోని ఎమ్మిగనూరు రోడ్డులో ఉన్న శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఆపరేషన్ దండయాన పోస్టర్లను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మహిళల భద్రత, నేరాల నివారణ మరియు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాల నివారణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని, ఏది నేరం, ఏది నేరం కాదనే విషయాలను తెలుసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.
ముఖ్యంగా యువత, 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు పోక్సో చట్టం సహా వివిధ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు.
ఎక్కడైనా నేరం జరుగుతుందనే అనుమానం కలిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. మహిళలు ఏ చిన్న సమస్య వచ్చినా భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్, డయల్-112, 100, మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్‌లైన్ 1098, సైబర్ నేరాల కోసం 1930 వంటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందిస్తారని తెలిపారు. కుటుంబ కలహాల విషయంలో పోలీసులకు సమాచారం అందిస్తే కౌన్సిలింగ్ ద్వారా చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. చట్టాలపై ప్రజల్లో అవగాహన పెరిగితేనే నేరాలు తగ్గుతాయని ఆయన అన్నారు.
అడిషనల్ ఎస్పీ జె. బాబు ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాలని సూచించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలు లేదా వేధింపులు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.
అర్సెలర్ మిట్టల్/విండ్ పవర్ సంస్థ ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ తమ సంస్థల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఉద్యోగులకు మహిళలపై నేరాల నివారణపై ముందస్తు అవగాహన కల్పించి, గౌరవప్రదంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
అనంతరం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఎస్పీ సన్మానించారు. వాలీబాల్ క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో కోడుమూరు ఇంచార్జ్ ఎంపీడీవో క్రిష్ణారెడ్డి, ఎమ్ ఈ ఓ రామచంద్రుడు, కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్సై ఎర్రిస్వామి, సి. బెళగల్ ఎస్సై వేణుగోపాల రాజు, అర్సెలర్ మిట్టల్/విండ్ పవర్ సంస్థ ప్రతినిధులు శ్రీధర్, శ్రీనివాస్, కిరణ్, పోలీసు సిబ్బంది, డ్వాక్రా, పొదుపు సంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



---

# కర్నూలు టౌన్‌లో చోరీ కేసు ఛేదన

# మహిళ అరెస్ట్, బంగారు ఆభరణాలు స్వాధీనం

**రెండు చోరీ కేసుల్లో నిందితురాలి పాత్ర వెలుగులోకి సుమారు 25 గ్రాముల బంగారం, రూ.55,000 నగదు రికవరీ చేసిన పోలీసులు**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 4)**
కర్నూలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఓ మహిళను అరెస్ట్ చేసి, దొంగిలించిన బంగారు ఆభరణాలు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు.
మొదటి ఘటనలో, కర్నూలు టౌన్ శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన దాసరి శిరీష 19.05.2026న మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్లి, 20.05.2026 సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. ఆమె ఇంటి ప్రధాన తలుపు తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి బెడ్‌రూమ్‌లోని డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉంచిన సుమారు 25 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
దర్యాప్తులో భాగంగా కర్నూలు టౌన్ టీవీ టవర్ సమీపంలోని నంద్యాల చెక్‌పోస్ట్అరుంధతి నగర్ రోడ్ వద్ద పోలీసులు అనుమానితురాలు జేగ్గిలి నాగ మల్లేశ్వరి (వయసు 32) ను అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుండి ఒక నెక్లెస్, చెవి కమ్మలు, డిజైన్ కమ్మలు, పెద్ద కమ్మలు, ఒక బంగారు ఉంగరం తదితరాలు కలిపి మొత్తం సుమారు 25 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.
అదే విధంగా, గతంలో 11.02.2026న కర్నూలు 4వ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, గణేష్ నగర్-2 ప్రాంతంలో జరిగిన మరో చోరీ కేసులోనూ ఇదే నిందితురాలి పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఆ కేసులో చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను విక్రయించి పొందిన రూ.55,000 నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
ఈ రెండు కేసుల దర్యాప్తును కర్నూలు త్రీ టౌన్ సీఐ డా. పి. శేషయ్య పర్యవేక్షణలో, ఎస్ఐ ఎం. చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

---

# బిసి సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలి

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డిఓ కి వినతి పత్రం**




**గుత్తి జూన్ :05 రిపబ్లిక్ న్యూస్** ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ యాదవ్,వెంకటేష్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వెనకబడిన ప్రాంతంలో గుత్తి పట్టణం ఒకటి ఈ ప్రాంతంలో ఎక్కువమంది వలసల వెళుతూ ఉంటారు గుత్తి పట్టణం కర్నూలు జిల్లా సరిహద్దు ప్రాంతం కావడం వల్ల ఎక్కువమంది విద్యార్థులు గుత్తి పట్టణానికి చదువుకోవడానికి వస్తూ ఉంటారు ఇలాంటి గుత్తి పట్నంలో పాఠశాల కు అనుబంధంగా బిసి సంక్షేమ హాస్టల్ లేకపోవడం చాలా దౌర్భాగ్యమైన విషయం గుత్తి మండల కేంద్రంలో గర్ల్స్ హైస్కూల్లో దాదాపుగా 1000 మందికి పైబడి విద్యార్థినిలు చదువుతూ ఉంటారు గుత్తి కోట పాఠశాలలో ఎక్కువమంది విద్యార్థులు ఉంటారు ఇలాంటి ప్రధానమైన మండల కేంద్రంలో బీసీ సంక్షేమ హాస్టల్ లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు మరి కొంతమంది పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఎస్టి సంక్షేమ హాస్టల్లో ఉండి చదువుతున్నారు ఈ ఎస్టీ సంక్షేమ హాస్టల్లో మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకు దాదాపు 250 మంది విద్యార్థులు ఉంటున్నారు విద్యార్థులు హాస్టల్ నుండి పాఠశాలకు బయలుదేరాలంటే మూడు కిలోమీటర్లు దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాల విద్యను అభ్యసించవలసిన పరిస్థితి గుత్తి మండల కేంద్రంలో విద్యార్థినిలకు పాఠశాల నుండి హాస్టల్ కి వెళ్లే సందర్భంలో సింగల్ రోడ్డు కావడం వలన ముళ్ళపదలో కంపచెట్లు రహదారి సరిగా లేకపోవడం వలన రహదారి మధ్యలో మద్యం సేవించిన వారు ఆకతాయిలు యూటీజింగ్ ర్యాగింగ్ చేయడం వల్ల విద్యార్థినిలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ ఇబ్బందులు అధికారులు దృష్టిలో ఉంచుకొని అనేకమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆర్టీసీ అధికారులకు మరియు సంక్షేమ శాఖ అధికారులు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందజేసినప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని గర్ల్స్ హై స్కూల్ పక్కనే గతంలో బీసీ బాయ్స్ హాస్టల్ ఉండేది అనేక కారణాలు వలన బీసీ హాస్టల్ మూసి వేయడం జరిగింది ఇప్పుడు ప్రస్తుతానికి భవనం ఖాళీగా ఉన్నది అధికారులు చొరవ తీసుకొని గర్ల్స్ హై స్కూల్ పక్కన (గుత్తి పోలీస్ స్టేషన్ పక్కన) ఖాళీగా ఉన్న భవనంలో బీసీ గర్ల్స్ హాస్టల్ లో ఏర్పాటు చెయ్యాలి విద్యార్థులకు రక్షణ కల్పించాలి అదేవిధంగా పేద మధ్యతరగతి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధను, చిన్న,సాయి, మురళి, చందు,సంతోష్ , శరత్, హరినాథ్ రెడ్డి , అరుణ్ కుమార్ రెడ్డి, అఖిల్ తదితరులు నాయకులు పాల్గొన్నారు

---

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్ఆర్సీపీ నిరసన

**మేనిఫెస్టో దహనం -కర్నూలు జొహరాపురం ఆటో స్టాండ్ సర్కిల్ వద్ద ఆందోళన**

**-ఎన్నికల హామీలు అమలు చేయలేదని తీవ్ర ఆరోపణలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 4)**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్ఆర్సీపీ నాయకులు కర్నూలు నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జొహరాపురం ఆటో స్టాండ్ సర్కిల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి మేనిఫెస్టోను దహనం చేసి నాయకులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్ మరియు జిల్లా అధ్యక్షుడు ఎస్ వి మోహన్ రెడ్డి అలాగే రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పాల్గొన్నారు. వారు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు.
నాయకులు మాట్లాడుతూ, "సూపర్ సిక్స్" పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కదాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ఇది ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు.
నిరుద్యోగులు, రైతులు, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు కూటమి పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం దారుణమని మండిపడ్డారు.
ప్రజా సమస్యలపై పోరాడేది వైఎస్ఆర్సీపీ మాత్రమేనని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



---

# అక్కిరెడ్డి సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన కొరముట్ల.



**రైల్వే కోడూరు జూన్ 4 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లె మండలం సంజీవపురం గ్రామం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు అక్కిరెడ్డి సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి రాష్ట్ర వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పూలమాలవేసి నివాళులర్పించారు,, గురువారం సుబ్బరామిరెడ్డి పెద్దకర్మ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రాష్ట్ర వైఎస్ఆర్సిపి ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రెటరీ అక్కిరెడ్డి మధుసూదన్ రెడ్డికి సంఘీభావం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాదినేని వెంకటరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, కాకర్లవారిపల్లి ఎంపీటీసీ గిరినాయుడు, కోర్లకుంట ఎంపీటీసీ వత్తలూరుకుమార్ రెడ్డి , పెద్దఓరంపాడు మాజీ సర్పంచ్ రవికుమార్, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కొల్లంగంగిరెడ్డి కుమారుడు, మరియు ఓబులవారిపల్లి మండల బిజెపి సీనియర్ నాయకులు పులపత్తూరి రామ సుబ్బారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు,.

## దేవనకొండలో ఓటరు జాబితా సవరణపై అవగాహన సమావేశం

### పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలి: తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి



**దేవనకొండ, జూన్ 4( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** దేవనకొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని, అర్హత లేని పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన వారి వివరాల తొలగింపు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకొని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఈ ప్రక్రియలో సహకరించాలని కోరారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగు పరచడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని ఆయన అన్నారు. సమావేశంలో ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసిన ప్రముఖులు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 04 రిపబ్లిక్ న్యూస్** కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు . ఈ కార్యక్రమానికి దేశంలోని పలువురు ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో చౌడేపల్లి మండలానికి చెందిన సుదర్శన్ రాజు, రెడ్డి ప్రసాద్, శ్రీనివాసులు రాజు పెద్దపంజాణి మండలానికి చెందిన నడింపల్లి పురుషోత్తం రాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు . ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ముందు మాదిరాజు సుదర్శన్ రాజు పురుషోత్తమ రాజులు పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలు విజయవంతంగా ముగించినందుకుగాను రేవంత్ రెడ్డి క్షత్రియులను అభినందించారు. తమకు ఏ కార్యక్రమాన్ని పురమాయించిన సమర్థవంతంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా క్షత్రియులు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## వైసిపి ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ నిరసన కార్యక్రమం



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 04 రిపబ్లిక్ న్యూస్**

మండల కేంద్రమైన చౌడేపల్లి లోని బస్టాండ్ లో గల దేవంగత ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహం వద్ద వైసిపి నాయకులు బాబు షూటి మోసం గ్యారంటీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు ప్రసంగిస్తూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న తర్వాత అధికారంలో కి వచ్చినప్పుడు చేసిన వాగ్దానాలను విస్మరించాలన్నారు. నిరుద్యోగ భృతి బీసీలకు 50 సంవత్సరాలు దాటిన తర్వాత పింఛన్లు వంటి కార్యక్రమాలు తుంగలో తొక్కరన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం పరుగులు తీసేయన్నారు. మెగా డీఎస్సీ పేరుతో కేవలం 16,000 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి నిరుద్యోగులను దగా చేశారని ఆరోపించారు అనంతరం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ ఉపాధ్యక్షుడు నడింపల్లి దామోదర్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి,బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ,మండల పార్టీ ఉపాధ్యక్షుడు జంగాలపల్లి వెంకటరమణ,వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, నరసింహులు యాదవ్, రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి రుక్మిణమ్మ, రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్, భాస్కర, రామనారాయణరెడ్డి, పద్మనాభరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రవిచంద్ర రెడ్డి,వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎర్రటి ఎండలో ఉపాధి పనులు చేస్తే రోజుకు 30,40 రూపాయలు వేతనం వేయడం తగునా

### ఉపాధి హామీ చట్టం ప్రకారం రోజుకు 310 రూపాయల కూలి వేయాలి

### ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్





**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 4 (రిపబ్లిక్ న్యూస్)** గురువారం రోజున ఓర్వకల్లు మండలం లొద్ది పల్లె గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఉపాధి కూలీలు రోజుకు 30,40 రూపాయల కూలి మాత్రమే పడిందని వాపోయారు ఈ సందర్భంగా బి నాగన్న మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని రద్దుచేసి వి బి జి రాంజీ పథకాన్ని తీసుకొచ్చిందని ఈ పథకంలో గత చట్టంలో ఉండే హక్కులు లేవని దానివల్ల సమ్మర్ అలవెన్స్ 35% అదనంగా వచ్చే కూలి రావడంలేదని వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు పనిముట్లు పారా సలికే ఇచ్చేవారని పనుల వద్ద సౌకర్యాలు నీడ మజ్జిగ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఇచ్చేవారని ఇప్పుడు కూలీలకు ఏమి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు విపరీతమైన ఎండలతో రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో వడదెబ్బ తగిలి ఉపాధి కూలీలు ఇతర ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి పరిస్థితుల్లో కూలీలను రెండు పూటలా పేస్ యాప్ పేరుతో 10:30, 11 గంటల వరకు కూలీలను పని ప్రదేశంలో పెట్టడం సరైన పద్ధతి కాదని విమర్శించారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని కూలీలకున్న హక్కులను సౌకర్యాలను అమలు చేయాలని రోజుకు 310 కూలి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో హరికుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ ఉపాధి మెట్లు కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## బనగానపల్లెలో ‘పెద్ది‘ హంగామా

### : 200 మందికి స్వీట్లు పంచిన మెగా అభిమాని

### ఘనంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చిత్ర విడుదల వేడుకలు

### పెద్దరాజుపాలెం శివరాముడు (కృష్ణ) వినూత్న అభిమానంపై ప్రశంసల జల్లు






**బనగానపల్లె, జూన్ 04 రిపబ్లిక్ (న్యూస్)** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య తెరకెక్కిన స్పోర్ట్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘పెద్ది’ చిత్రం గురువారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ నేపథ్యంలో బనగానపల్లె పట్టణంలో మెగా అభిమానుల కోలాహలం అంబరాన్నంటింది. థియేటర్ల వద్ద ఉదయం నుంచే పండగ వాతావరణం నెలకొంది. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, సామాజిక దృక్పథంతో రామ్ చరణ్ అభిమాన సంఘాల నాయకులు, కార్యకర్తలు పట్టణంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

**తీపి పంచిన వీరాభిమాని:**

ఇదిలా ఉండగా, నియోజకవర్గ పరిధిలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రామ్ చరణ్ డైహార్డ్ ఫ్యాన్ శివరాముడు (కృష్ణ) తన అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు. సినిమా విడుదలైన ఆనందంలో ఆయన స్థానిక థియేటర్ ప్రాంగణంలో దాదాపు 200 మందికి పైగా ప్రేక్షకులు, స్థానికులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. తన దైవంగా భావించే రామ్ చరణ్ సినిమా ఎప్పుడు విడుదలైనా ఇలా థియేటర్ల వద్ద ప్రేక్షకులకు స్వీట్లు పంచడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని, దీనిని ఒక ఆనవాయితీగా, సెంటిమెంట్‌గా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి సినిమా రిలీజ్ సందర్భంగా ఎంతో ఉదారంగా స్వీట్ల పంపిణీ కార్యక్రమం చేపడుతూ, తోటి అభిమానుల్లో జోష్ నింపుతున్న శివరాముడిని స్థానిక ప్రజలతో పాటు మెగా డైహార్డ్ ఫ్యాన్స్ ప్రత్యేకంగా అభినందించి, కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మెగా అభిమానులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అంతా మాయేనా!







**రైల్వేకోడూరు జూన్ 4 రిపబ్లిక్ న్యూస్.**

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా బాబు ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు చేయకపోవడం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ఏమైందని, అంతా మాయేనా! బాబు మాటలు నీటి మూటలుగా మిగిలాయని ప్రజలను తీవ్ర మోసం చేశారని రాష్ట్ర వైఎస్ఆర్సిపి మాజీ ప్రభుత్వ విప్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రైల్వే కోడూరు నియోజకవర్గం ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు,

రైల్వేకోడూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో దానికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి గౌరవనీయులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం టోల్గేట్ వైయస్సార్ విగ్రహం వద్ద, ప్లకార్డులు చూపిస్తూ, గతంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన మేనిఫెస్టోను , బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ బాండ్లను చూపిస్తూ అనంతరం వాటిని చించేసి నిరసన తెలియచేశారు,

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాదినేని వెంకట్ రెడ్డి, ఎంపీపీ సింగనమాల భవాని,అన్నమయ్య జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, శివారెడ్డి, జడ్పిటిసి రత్నమ్మ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ నందా బాల, పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, స్టేట్ బీసీ సెల్ కార్యదర్శి, ఇనమాల మహేష్,మాజీ సర్పంచులు రామకృష్ణ, శ్రీరామ్ వినోద్, బుడిగి శివయ్య,ఎంపీటీసీలు, ఆంజనేయులు,రౌఫ్, గని , కరీముల్లా, ఫరూక్,సింగనమాల రాజగోపాల్,డీవీ రమణ, సిద్దయ్య, లక్కీరెడ్డి రాజారెడ్డి,అన్నమ్మయ్య జిల్లా యూత్ సెక్రటరీ డమ్ము రఘు, మహిళా నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు , నారాయణమ్మ, అరుణమ్మ,మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు భారీగా పాల్గొన్నారు

పుల్లంపేటలో.. మండలకేంద్రం పుల్లంపేట నేషనల్ హై వే ప్రక్కన వై యస్ ఆర్ విగ్రహం వద్ద బాబు పాలనకు వ్యతి రేఖంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తప్పుదోవ పట్టిస్తు బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటి ఒక బూటకమని ప్లేకార్డులు చూపిస్తూ వాటిని చింపేశారు, ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వ కుటిల నీతిని గమనించాలని, టీడీపీ ప్రజాకంటక పాలనకు రాబోయే ఎన్నికల్లో ఆపార్టీకి చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపు నిచ్చారు,కార్యక్రమం లో మండల కన్వీనర్ ముస్తాక్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం శ్రీనివాసులు, జడ్పిటిసి రామ్నాథ్ సీనియర్ నాయకుడు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల కంటే కూడా ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేసిన కూటమి ప్రభుత్వం

### సోమయాజులు పల్లె గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు పెను మాళ సంజీవులు



**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 4 (రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లె గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు సింగల్ పెరుమాళ మాట్లాడుతూ,

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్ల పాలనలో సూపర్ సిక్స్ పథకాలు చేసి ఇంకా దాదాపు 100 పథకాలు దిగ్విజయంగా పూర్తి చేసిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వానికి దక్కిందని అన్నారు, ఓర్వకల్లు మండల పరిధిలోని సోమయాజులపల్లె.. 239 బూతు ఇంచార్జ్ సంజీవులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు.

గత నెలలో రెండు రోజులపాటు వర్చువల్ గా జరిగిన స్త్రీ శక్తి మహానాడు విజయవంతం అయిందని అన్నారు. అందులో భాగంగా కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్రంలో మహిళా రిజర్వేషన్ 33% ప్రకటించిన ఏకైక పార్టీ తెలుగు దేశం అన్నారు. వర్చువల్ మహానాడుకు హాజరైన దాదాపు 20 లక్షల మంది సాక్షిగా ప్రకటించడం స్వాగతించాల్సిన అంశం అన్నారు. అవసరమైతే మహిళా రిజర్వేషన్ 60 శాతం పెంపుకు కట్టుబడి ఉన్నామని స్వయంగా ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రకటించిన అంశాన్ని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినసూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధాప్య, వితంతు పెన్షన్ 4వేల పెంపు, వికలాంగులకు 6 వేలకు పెంచి ప్రతి నెల ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్న ఘనత కూటమిదే అన్నారు.

ఒకవేళ పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే ఎలాంటి జాప్యం లేకుండా మరుసటి నెల నుండి భార్యకు అందిస్తున్న విధానం అమలు అంశాలను క్షేత్రస్థాయిలో ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు. పింఛన్ కు అర్హత కలిగి ఉండిపొందలేనటువంటి వారికోసం ఈనెల 12 నుండి దరఖాస్తులు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది కూడా కూటమి ప్రభుత్వమే అన్నారు. దేశానికి పట్టుకొమ్మలైనటువంటి గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో, 7 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టిన అంశాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్తామని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంతల మయంగా మారిన రహదారులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో గుంతల రహిత రోడ్ల నిర్మాణమే ధ్యేయంగా పనులు చేపట్టి వాహనదారులు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది అని గర్వంగా తెలిపారు. మూడు రాజధానుల పేరుతో కేంద్రశీ నుండి ఎలాంటి గెజిట్ పొందలేకపోయిందని, అమరావతి రాజధానిగా స్పష్టమైన గెజిట్ తెప్పించి, రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా సాగడంతో రాష్ట్ర అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. అంతేకాకుండా విశాఖ రైల్వే జోన్ సాధనలోనూ కూటమి ప్రభుత్వం సఫలీకృతం అయిందని చెప్పారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సారధ్యంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని అని చెప్పారు. గతంలో ప్రకటించిన పరిశ్రమల హబ్ నందు పలు కంపెనీలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన అంశాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించినందుకు తనను అభినందిస్తూ ఉత్తమ కార్యకర్తగా ప్రశంస పత్రాన్ని అందించినట్లు వివరించారు.,

మన టిడిపి యాప్ నందు విస్తృత ప్రచారం ద్వారా చైతన్య పరిచినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు గుర్తించి ప్రశంసా పత్రం అంద జేశారు. పార్టీ అమలు చేస్తున్న సూపర్ -6 పథకాలు అమలు తీరుపై బూతు పరిధిలో 100% పూర్తి చేసినందుకు మహానాడు నందు ఉత్తమ సీనియర్ కార్యకర్తగా సన్మానించడం మరువలేనని సంజీవుడు పేర్కొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండలంలో ఎన్నో పరిశ్రమలు వచ్చాయని వాటి ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని వారు ఉన్నారు, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చెప్పిన హామీల కంటే పది రెట్లు ఎక్కువగానే అభివృద్ధి పనులు చేసిందని వారు చెప్పారు

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు హామీల అమలుపై ఓర్వకల్లులో వైఎస్సార్సీపీ నిరసన

**పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**










**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 4 (రిపబ్లిక్ న్యూస్)**
గురువారం రోజున,ఓర్వకల్లు మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, కాటసాని రామభూపాల్ రెడ్డి మరియు వైఎస్సార్సీపీ నాయకులు కలిసి వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి నిరసన ర్యాలీగా బయలుదేరి ఓర్వకల్లు బస్టాండ్ వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో, సూపర్ సిక్స్ హామీలకు సంబంధించిన ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు.వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా వాటి అమలుపై స్పష్టత లేదని విమర్శించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు “ఆడబిడ్డ నిధి“ పేరుతో నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని, రాష్ట్ర మహిళలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. అలాగే నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించిన హామీ కూడా అమలుకాలేదని విమర్శించారు.ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్న హామీ, కొత్త పింఛన్ల మంజూరు, ఇతర సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు, రాష్ట్ర ప్రజల తరఫున వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు, ఆందోళనలు నిరంతరం కొనసాగుతాయని కాటసాని రామభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మీదివేముల ప్రభాకర్ రెడ్డి ,ఓర్వకల్లు జడ్పీటీసీ రంగనాథ్ గౌడ్ ,కాశిరెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి, ఎంపీపీ తిపన్న ,శివ కృష్ణ రెడ్డి ,ఎంపిటిసి ఉస్మాన్ బాషా ,శంకర్ రెడ్డి ,మాజీ సర్పంచ్ పెద్దయ్య ,చంద్ర శేఖర్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి,ప్రవీణ్ కుమార్ రెడ్డి, చంద్ బాషా,అనిల్ , ప్రభు ,హుసేనాపురం వెంగన్న ,నాగ తిరుపాల్ , రమణ రెడ్డి ,గుట్టపాడు రామకృష్ణ రెడ్డి ,శకునాల ప్రవీణ్ కుమార్ రెడ్డి, పుల్లారెడ్డి, నాగార్జున గౌడ్, యువరాజు ,శ్రీను నాయక్ , పాలకొలను రమేష్ , బ్రాహ్మణపల్లె రవి, తిప్పాయపల్లె హరినాథ్ రెడ్డి ,పుడిచెర్ల మహేశ్వర రెడ్డి ,కనమడకల వెంకటేశ్వర్లు ,సోమయాజుల పల్లె మదన్ ,కాల్వ వెంకటేశ్వర్లు, లొద్దిపల్లె ప్రభాకర్ రెడ్డి, మరియు ఓర్వకల్లు మండల మరియు గ్రామ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేస్తాం

**జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 2వ సమావేశంలో 97 అక్రిడిటేషన్ లు మంజూరు -కలెక్టర్ , జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్, జూన్ 04,(రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ , జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్లో ఐ.అండ్.పీఆర్ (జిల్లా సమాచార , పౌర సంబంధాల శాఖ) ఆధ్వర్యంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 2వ సమావేశాన్ని కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి అర్హత కలిగిన ప్రతి ఒక్క జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డులలో నిబంధనల ప్రకారం ఏవైనా అభ్యంతరాలు ఉంటే సభ్యులు కమిటీ దృష్టికి తీసుకురావడం చేయాలని, దానిపై విచారించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మీటింగ్ కు 5 రోజుల ముందు ప్రిపరేటరీ మీటింగ్ ను సభ్యులతో నిర్వహించాలని ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ , డిఎంఏసి మెంబర్ కన్వీనర్ కు సూచించారు. అక్రిడిటేషన్ కొనసాగాలంటే పేపర్ల రెగ్యులారిటీ ఖచ్చితంగా ఉండాలని, లేకపోతే తొలగించాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో జిల్లాలో రెండవ విడతగా 97 అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగింది. ఇందులోభాగంగా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఆలోచించి అర్హత కలిగిన వారికి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరగా, క్రమం తప్పకుండా పత్రికలు, పీరియాడికల్స్ డిఐపిఆర్ఓ కార్యాలయానికి అందచేయాలని, నిజాయితీగా ఉండే వాళ్లకి, ఎలాంటి తప్పులు చేయని వారికి నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ మరియు డిఎంఏసి మెంబర్ కన్వీనర్ ఏ.బాలకొండయ్య, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఎస్.మహమ్మద్ అయుఫ్, ఏ.షఫీఉల్లా, సి.రవికుమార్, సి.ప్రతాప్, కె.అనిల్ కుమార్ రెడ్డి, కె.మల్లికార్జునరావు, ఎస్ఎండి.రసూల్, ఆర్.రామంజినేయులు, ఆర్వీఎస్.ప్రసాద్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, లేబర్ కార్యాలయం ఏసీఎల్ లావణ్య, గృహ నిర్మాణ శాఖ అధికారి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, ఐ.అండ్.పీఆర్ ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పిఆర్ఓ వి.సూర్యనారాయణ రెడ్డి, టైపిస్ట్ దామోదర్ రెడ్డి, టెక్నీషియన్ కమల్ పాల్గొన్నారు.

# హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

**“చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు “ వైసీపీ నిరసన -మేనిఫెస్టో ప్రతులు దహనం**





**అనంతపురం / వజ్రకరూరు**
**సంక్షేమం, జూన్ 04,(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. “చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు“ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండల కేంద్రంలో వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పీఏసీ సభ్యుడు వై. విశ్వేశ్వర్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై. ప్రణయ్‌రెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు.జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, మండల అబ్జర్వర్ భీమారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ వీరన్న మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు మొత్తం 143 హామీలను ప్రజలకు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేకుండా ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు.ఇప్పటికైనా ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో భాగంగా వైసీపీ శ్రేణులు వజ్రకరూరులోని ఉస్మాన్ షాప్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల మేనిఫెస్టో ప్రతులకు నిప్పంటించి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ దేవీభాయి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు డిష్ సురేష్, మండల ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మాజీ సర్పంచ్ మెనాలిసా రవికాంత్‌రెడ్డి, కమలపాడు నారాయణరెడ్డి, ప్యాపిలి కిష్ట, ముష్టూరు రెడ్డి శ్యామ్, రాకెట్ల బాబు, నెట్టికల్లు శివాజీ నాయక్, హబీబ్, మధుసూదన్‌రెడ్డి, రఘుపతి భరత్‌రెడ్డి, నరసింహులు, బీమా జగన్‌రెడ్డి, వెంకటేష్ నాయక్, రాజశేఖర్, వీర రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**కమిషనర్ చల్లా ఓబులేసు సూచన -పారిశుద్ధ్య కార్మికుల కుటుంబ సంక్షేమం, ఆరోగ్యంపై దృష్టి సారించాలని హితవు**

**షరీన్ నగర్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 4)**
నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించడంతో పాటు కుటుంబ సంక్షేమం, ముఖ్యంగా పిల్లల విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు.ఆయన కృష్ణనగర్ ఐటీసీ సర్కిల్, షరీన్ నగర్, చెన్నమ్మ సర్కిల్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. షరీన్ నగర్‌లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరుగుతుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసి అక్కడి శానిటేషన్ కార్యదర్శులు, కార్మికులను అభినందించారు.
అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, పిల్లల విద్యాభ్యాసం, ఆరోగ్యం వంటి అంశాల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధులు ముగిసిన తరువాత కుటుంబ సభ్యులతో సమయం గడపాలని, పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మంచి విద్య ద్వారానే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో అధికారుల సహకారం తీసుకోవాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని హితవు పలికారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన తప్పనిసరి అని స్పష్టం చేశారు.కృష్ణనగర్ ఐటీసీ సర్కిల్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో కొన్ని టీ బంకుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయకపోవడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత వ్యాపారులకు జరిమానాలు విధించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, అనిల్ కుమార్, మల్లికార్జున, ఏ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పిల్లలకు ఉచిత విద్య అందించాలి

**బీమా ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం చేయూతనివ్వాలి**

**జిల్లా కలెక్టర్ కు ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి**



**అనంతపురం కలెక్టరేట్, జూన్ 04, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల్లో ఉచితంగా విద్యను అందివ్వాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా కల్టెకరు ఒ.ఆనంద్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫివుల్లా, రేపటి రామాంజినేయులు, నాయకులు అనిల్ కుమార్‌రెడ్డిలు కలెక్టరు ఒ.ఆనంద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితులు సరిగాలేవని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చాలిచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న జర్నలిస్టుల పిల్లలను చదివించుకోవడం భారంగా ఉందన్నారు. కావున జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో అందివ్వాలని కోరారు. గతంలోనూ దీన్ని కొంత వరకు జిల్లాలో అమలు చేసియున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే కొన్ని విద్యా సంస్థలు కలెక్టర్ ఇస్తున్న ఉత్తర్వులను పట్టించుకోవడం లేదని తెలిపారు. అదే విధంగా వైద్యం కూడా భారంగా మారిందని, ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు అందిస్తున్న హెల్త్ స్కీమ్‌కు అయ్యే ప్రీమియంను సిఎస్ఆర్ నిధులతో చెల్లించేందుకు తోడ్పాటునందివ్వాలని కోరారు. ఈ రెండింటిపైనా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారితోనూ, ప్రైవేట్ విద్య సంస్థల యూనియన్లతోనూ ఒక సమావేశం ఏర్పాటు చేసి ఉచిత విద్య జర్నలిస్టు కుటుంబాలకు అందివ్వాలని సూచిస్తామని హెల్త్ స్కిమ్ ప్రీమియం చెల్లింపు అంశాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ హామీనిచ్చారన్నారు.

# ఓర్వకల్లు మండల గ్రామాల్లో ప్రతి గ్రామంలోనూ మొక్కలు



**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 4 (రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండలం ఎంపీడీవో నాగ అనసూయ మాట్లాడుతూ ఓర్వకల్లు మండల గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామపంచాయతీలో 2500 మొక్కలు కాలువ బుగ్గ నర్సరీ నుండి తీసుకొని వెళ్లి నాటడం జరుగుతున్నది అని వారు తెలియజేయడమైనది

# ఎస్ ఐ ఆర్ పై ముస్లింలకు భరోసా కల్పించాలి

**కర్నూలులో మైనారిటీస్ కౌన్సిల్ అవగాహన సదస్సు**

**ముఖ్య అతిథిగా రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు కె.యం. షకీల్ షఫీ**

**ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులంతా భాగస్వాములు కావాలి**




**కర్నూలు ప్రతినిధి, జూన్ 04,(రిపబ్లిక్ న్యూస్):**
ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై ముస్లిం సమాజంలో ఎలాంటి అపోహలు, భయాందోళనలు ఉండకూడదని రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు జనాబ్ అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కర్నూలు ఉర్దూ ఘర్ షాదీఖానాలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.భారతదేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చొరవతో శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, పార్టీ నాయకులకు ఎస్ ఐ ఆర్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడతాయని అన్నారు.ముఖ్యంగా ముస్లిం సోదరులు ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అనవసర ఆందోళనలకు గురికాకుండా ముందుకు రావాలని సూచించారు. మైనారిటీల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ముతవల్లీలు, ఇమాములు, మైనారిటీస్ కౌన్సిల్ ప్రతినిధులు, మేధావులు, ప్రముఖులు, ముస్లిం సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డీసీయంఎస్ చైర్మన్, జాతీయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా











**కర్నూలు ప్రతినిధి, జూన్ 4 (రిపబ్లిక్ న్యూస్)**
గురువారం రోజున,డీసీయంఎస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎస్బీఐ కూడలి వద్ద ఉన్న అమరావతి లో నిర్వహించిన ఈకార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, డీసీయంఎస్ అధికారులు పాల్గొని నాగేశ్వరరావు యాదవ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బీసీ ల చిరకాల కోరిక అయినా చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమం చేస్తున్నామన్నారు. బీసీలకు ఎంతో అండగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి నిచూసి వైకాపా నేతలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని తెలిపారు. డీఎస్సీ పై వైకాపా నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసీపీ కుట్రరాజకీయాలు మానుకోవాలని నాగేశ్వరరావు యాదవ్ కోరారు. ఈకార్యక్రమంలో వెంకట రమణ రాజు, నక్కల మిట్ట శ్రీనివాసులు, సుజాత, మద్దిలేటి,సూగురు వెంకటేశ్వర్లు, అయ్యన్న యాదవ్, కురుమూర్తి, విజయ్, క్రిష్ణోజీ, ఉప్పరి శివన్న, లక్ష్మీ నారాయణ యాదవ్, వడ్డె బాలాజీ, పీజీ. వెంకటేష్, కురువ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మహిళలకు అవగాహన కల్పించిన సర్పంచ్ సాయికిరణ్

**ఆందోల్ ప్రతినిధి జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
నేరడిగుంట గ్రామంలోని మహిళలు ఆర్థికంగా స్వావలంబులుగా ఎదగాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని నేను స్వయంగా సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, గ్రామంలోని మరింత మంది మహిళలు ఈ శిక్షణలో పాల్గొనేలా అవగాహన కల్పించడం జరిగింది.



మహిళలు తమ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకొని టైలరింగ్ వంటి నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పొందవచ్చని వివరించడం జరిగింది. ముఖ్యంగా యువతులు, గృహిణులు ముందుకు వచ్చి ఈ శిక్షణలో చేరి తమ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కోరడం జరిగింది.మహిళల అభివృద్ధి గ్రామాభివృద్ధికి పునాది అని, ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆకాంక్షించడం జరిగింది. గ్రామంలోని మహిళలకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాల్లో మరింత మంది భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం నిర్వాహకులు, శిక్షణ పొందుతున్న మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారుద

# రైతులు అధైర్య పడొద్దు ధాన్యం చివరి గింజ వరకూ కొంటాం

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
రైతులు అధైర్య పడోద్దని ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ నుంచి అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడొద్దు అన్నారు.ఈ రోజు వరకు 71,327 మంది రైతుల నుంచి 3,50,620.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 57,496 మంది రైతుల లకు రూపాయలు 616.93 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయన్నారు.200 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేసి కేంద్రాలను మూసివేయడం జరిగిందనీ, ధాన్యం కొనుగోలు పూర్తి అయిన కేంద్రాల్లోని హమాలి , లారీలను ధాన్యం పూర్తి కానీ కేంద్రాలకు తరలించి వేగంగా అన్లోడింగ్ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద తదితరులు పాల్గొన్నారు



# రేపు అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అటవీ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా మెదక్ జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పర్యావరణ ఇతివృత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా జూన్ 5 (రేపు) ఉదయం 9:30 గంటలకు మెదక్ జిల్లాలోని అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్క్ వేదికగా ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి.ఈ పర్యావరణ మహోత్సవానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, మరియు ప్రకృతి సమతుల్యతను కాపాడటంపై ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మరియు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టనున్నారనీ,మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజి గురువారం ఒక ప్రకటనలో కోరారు.



# జోగిపేట 20వ వార్డు లో సమస్యలు ఎవరు పరిష్కారం చేస్తారు





**ఆందోల్ ప్రతినిధి జూన్ 4( ప్రజా రిపబ్లిక్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణ కేంద్రంలో గల వాసవి నగర్ కాలనీలలో ఎక్కడి చెత్త అక్కడే మోరీలు తీయలేని పరిస్థితుల్లో ఉన్నారు మున్సిపల్ సిబ్బంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులు అవుతాయని ఆశ తోటి గెలిపిస్తే చివరకు నిరాశగా మిగిలిపోతున్నాయి. గత ప్రభుత్వంలో పట్టించుకోకపోతే కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అయినా సమస్యలు తీరుతాయని అనుకున్నా ఫలితంగానే మాత్రం శూన్యమే మిగిలిపోతుంది. జోగిపేట మున్సిపల్ పట్టణంలో చీటికిమాటికి మున్సిపల్ కమిషనర్లు మారుతుంటారు. పనులు మాత్రం ముందుకు సగడం లేదు? నూతన పాలకవర్గం ఏర్పడ్డాక జోగిపేట మున్సిపల్ చైర్మన్ కు పలుమార్లు తెలియజేసినప్పటికీ చేద్దాం బడ్జెట్ వచ్చాక అన్ని తెలుపుకుంటూ సమాధానం చెప్పేవారు. గత కమిషనర్ను పలుమార్లు కాలనీలో సందర్శించినప్పటికీ చెప్పిన ఈసారి బడ్జెట్లో ఎలాగైనా చేపిస్తాము అని ఏదో సాకు చెప్పుకుంటూ వెళ్లిపోయారు. ఇప్పటికైనా మీడియా ద్వారా బేడ బుడగ జంగాల, సిగ్లిగర్ బస్తీలలో రోడ్డుపై కప్పు వేసి పనులు చేపిస్తే బాగుంటుందని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

# బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలి

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో విద్యాధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలని,విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్, ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు గైకొనాలని సూచించారు ,జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

### జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని శంకరంపేట ఆర్ మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హాజరై గ్రామస్థులతో సమావేశమయ్యారు.
గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి , హార్టికల్చర్ అధికారి,ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ..రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు.
ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ , ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని సూచించారు.
గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల రంగు బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు.గ్రామసభలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పంటల మార్పిడి, బడిబాట కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కోరారు.
రైతులు సంప్రదాయ పంటలతో పాటు పంటల మార్పిడిని అలవాటు చేసుకొని ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.
అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ గ్రామ సభలో గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, వ్యవసాయ అధికారి దేవకుమార్ , హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ ,సర్పంచ్ సంతోష నవీన్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు.





# అందోల్ లో 99 రోజుల ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమం.




**అందోల్ ప్రతినిధి జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 4,5,6,7,8, వార్డులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం 99రోజుల ప్రజా పాలన కార్యక్రమం ఆందోల్ లో ఉన్న శ్రీరామాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. వార్డు లో సమస్యలు , కుక్కల బెరడ, నీటి సమస్యలు , వీధి దీపాలు , వార్డులలో సమస్యలు గ్రామ ప్రజలు తెలియజేశారు . ఈ సమస్యలు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి కీ ప్రజలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్ కిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మున్సిపల్ కమిషనర్ తిరుపతి, మార్వేడు డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ తిరుమల కల్పన హరికృష్ణ గౌడ్, 5వార్డు కౌన్సిలర్ కొత్త గొల్ల మాధవి శ్రీనివాస్ యాదవ్, 6వ వార్డు కౌన్సిలర్ రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్, 7వ వార్డు కౌన్సిలర్ తోట్ల రామకృష్ణ , 8వ వార్డు కౌన్సిలర్ రాచకొండ నాగరత్నం గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కో ఆప్షన్ మెంబెర్ , మెప్మా బిక్షపతి ,మున్సిపల్ సిబ్బంది ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# మన్నాన్పల్లి గ్రామానికి చెందిన చిన్నారికి అరుదైన గుర్తింపు

### చిన్నారికి రచయిత్రిగా గుర్తింపు

**ఆందోల్ జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం మన్నాన్పల్లి గ్రామం కి చెందిన ఏడో తరగతి విద్యార్థిని లాస్య ప్రియ రచయిత్రిగా గుర్తింపు పొందింది. ఆమె రచించిన ది జర్నీ ఆఫ్ జాయ్ పుస్తకానికి ప్రముఖ ప్రచురణ సంస్థ బ్రీ బుక్స్ నిర్వహించిన సమ్మర్ బుక్ రైటింగ్ ఫెస్టివల్ 2026 లో హానర్ రోల్ సర్టిఫికెట్ లభించింది. చిన్న వయసులోనే ప్రతిభ చాటిన లాస్య క్రియకు జాతీయస్థాయిలో ప్రశంసలు దక్కాయి. మా గ్రామానికి చెందినటువంటి విద్యార్థికి ఇంత అరుదైన గౌరవం దక్కినందుకు సంతోష వ్యక్త పరుస్తున్న గ్రామస్తులు.




# తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం సమ్మె నగర




**ఆందోల్ ప్రతినిధి జూన్ 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** తెలంగాణరాష్ట్రంలోని అన్ని జిల్లాల భవన నిర్మాణ కార్మిక సంఘాలు రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ పిలుపు మేరకు అన్ని మండలలలో భవన నిర్మాణ కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయగలరని ఈ మేరకు కొండాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి శ్రీ నడిమింటి దావీదు గారూ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ రోజు అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులకుకూలీ రేట్లు బయట పరిస్థితితులకు అనుగుణంగా రెట్లు పెరగాలి కాబట్టి మన భవన నిర్మాణ కార్మికులందరం అందరము సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరుగుతుంది

# విజయం గమ్యం కాదు.. ఉన్నత లక్ష్యాలకు తొలి అడుగు

**: కలెక్టర్ రాజకుమారి**

**సబ్జెక్టుపై పట్టు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతోనే శిఖరాగ్రాలకు చేరుకోవాలి**

**ప్రతిభావంతులైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఘన సత్కారం**




**నంద్యాల బ్యూరో, జూన్ 04 (రిపబ్లిక్ న్యూస్):**
ఒక విజయం వద్దే ఆగిపోకుండా, దానిని మరిన్ని విజయాలకు పునాదిగా మలుచుకుని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారి విజయాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలు కేవలం పరీక్షల ఫలితాలకు మాత్రమే పరిమితం కాకుండా, భవిష్యత్ జీవితానికి బలమైన పునాది కావాలని ఆకాంక్షించారు. గురుకుల విద్యాసంస్థల్లో చదివి పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 12 మంది, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులతో పాటు ఏపీ మోడల్ స్కూల్, బీసీ వెల్ఫేర్ విద్యాసంస్థలకు చెందిన మరో ఐదుగురు విద్యార్థులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ రంగాల్లో పోటీ తీవ్ర స్థాయికి చేరుకుందని, కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాకుండా సబ్జెక్టుపై లోతైన అవగాహన, విశ్లేషణాత్మక దృష్టి, నిరంతర అధ్యయన తపన అవసరమని పేర్కొన్నారు. బట్టీ పట్టే విధానానికి బదులుగా ప్రతి అంశాన్ని అర్థం చేసుకుంటూ నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రశ్నించే విద్యార్థే నిజమైన విద్యార్థి అవుతాడని, జిజ్ఞాసే విజయానికి మూలమని చెప్పారు. విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, దేశ-విదేశాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై అవగాహన పెంపొందించుకోవాలని, నిరంతరం తమ జ్ఞానాన్ని నవీకరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. విద్యలో విజయం సాధించినప్పటికీ వినయాన్ని కోల్పోకూడదని, అపజయాలు ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా వాటిని పాఠాలుగా స్వీకరించి మరింత బలంగా ఎదగాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టం, త్యాగాలు విద్యార్థుల విజయాలకు పునాది కావాలని, వారి ఆశయాలను సాకారం చేయాలనే బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. స్వీయ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం జీవితంలో ఉన్నత శిఖరాలకు చేర్చగలవని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు హాబీలు, క్రీడలు, లైఫ్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలని, పుస్తక పఠనం, మొక్కల పెంపకం, ఈత, కరాటే వంటి కార్యకలాపాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని వివరించారు. అలాగే నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం వంటి సాఫ్ట్ స్కిల్స్ ఆధునిక ప్రపంచంలో అత్యంత కీలకమని తెలిపారు. తమతో పాటు వెనుకబడిన సహ విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారికి మార్గదర్శనం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వ్యక్తిగత విజయంతో పాటు సమాజాభివృద్ధికి కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని,





బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలను మరింత ఉన్నత లక్ష్యాలకు పునాదిగా మలుచుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పిల్లల విజయాల వెనుక తల్లిదండ్రులు అందించిన సహకారం, ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం అమూల్యమని పేర్కొంటూ వారందరికీ కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఆళ్లగడ్డలో జూన్ 5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**"వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ**



**నంద్యాల బ్యూరో, జూన్ 4 (రిపబ్లిక్ న్యూస్):**
"వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5వ తేదీన ఆళ్లగడ్డ నియోజకవర్గంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని కలెక్టర్ తెలిపారు. అలాగే గత మూడు వారాలుగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో స్వీకరించిన వినతులపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలకు సంబంధించిన ఎండార్స్‌మెంట్ కాపీలను అర్జీదారులకు అందజేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

**- ఏవో పవన్ కుమార్**




**బండి ఆత్మకూరు, జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-** కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. వీటివల్ల కౌలు రైతులకు సాగు హక్కులు వాటి ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన వివరించారు. గురువారం మండలంలోని పార్నపల్లి గ్రామంలో ధర్తీమాత బచావో అభియాన్ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వ్యాప్తంగా సుమారు 1050 మంది కౌలు రైతులు ఉన్నారని ఏవో తెలిపారు. కౌలుదారుల హక్కుల చట్టంపై కౌలు రైతులు భూ యజమానులు అవగాహన కలిగి భూమి కౌలుకు తీసుకున్న కౌలు రైతు ఆధార్ పట్టాదార్ పాస్ బుక్ తీసుకొని సంబంధిత రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు. వీటిని రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు పరిశీలించి అర్హులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డు జారీ చేయడం జరుగుతుందన్నారు. వీటివల్ల ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్ముకోవడానికి, పంట నష్టం వాటిలినప్పుడు నష్టపరిహారం పొందడానికి, పంటల బీమాకు అర్హులవుతారని ఆయన వివరించారు. కౌలు రైతులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు. ఈ కార్యక్రమంలో పార్నపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత ,పంచాయతీ సెక్రెటరీ ఇర్ఫాన్, నంద్యాల జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షులు నరసింహులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పది మంది బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ

**ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ చల్లా ఓబులేసు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 4)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియలో వెనుకబడిన పది మంది బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు.

స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో వెనుకంజలో ఉన్న బీఎల్వోలతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన బీఎల్వోలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్దేశించిన 45 రోజుల గడువులోపు పారదర్శకంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే బీఎల్వోలు, ఎన్నికల సిబ్బందికి 2002 ఓటరు జాబితాను 2026 ఓటరు జాబితాతో సరిపోల్చే ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అన్ని శిక్షణలు, ఏర్పాట్లు పూర్తైనప్పటికీ కొందరు బీఎల్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదని కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

# భూముల కౌలు వేలం.. ఆలయాలకు భారీగా పెరిగిన ఆదాయం




**బండి ఆత్మకూరు, జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలం, పార్నపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ, శ్రీవేణుగోపాల స్వామి, శ్రీ వీరభద్ర స్వామి ఆలయాలకు చెందిన మాన్యం భూములకు ఆలయ అధికారులు బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. గురువారం ఆలయ చైర్మన్ లు పి.ప్రతాప్ రెడ్డి, వెంకట రమణ, ఆలయ కార్యనిర్వహణాధికారి యస్.మోహన్ ఆధ్వర్యంలో జరిగిన కౌలు వేలాలకు పర్యవేక్షణ అధికారిగా నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి హాజరయ్యారు. శ్రీ ఆంజనేయ, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన సుమారు 52.2 ఎకరాల మాన్యం భూమినీ రూ 17.36 లక్షలకు రైతులు ఒక ఏడాది కౌలుకు దక్కించుకున్నారు. కాగా గత ఏడాది ఇదే భూమికి రూ 16.72 లక్షలు వచ్చిందని ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ప్రస్తుత ఏడాది రూ.64 వేలు ఆదాయం పెరిగినట్లు ఆయన వివరించారు. అలాగే శ్రీ వీరభద్ర స్వామికి చెందిన 22.69 ఎకరాల ఆలయ భూముల వేలంపాటల్లో రూ.7.68 లక్షలకు రైతులు ఒక ఏడాది కౌలుకు దక్కించుకున్నారు. అయితే గత ఏడాది ఇదే భూమికి రూ 7.86 లక్షలు వచ్చినట్లు ఈవో తెలిపారు. ప్రస్తుత ఏడాది రూ 18 వేలు రూపాయల వరకు తగ్గినట్లు ఈవో వివరించారు. వీటితో పాటు నంద్యాల టౌన్ లో వెలసిఉన్న కౌకంట్ల లక్ష్మయ్య గండికోట సుబ్బమ్మ అన్నసత్రం దేవస్తానమలకు చెందిన 19.19 ఎకరాల మాన్యం భూమికి రూ 7.56 లక్షల రూపాయలకు వేలం పాటల్లో కౌలు రైతులు ఒక ఏడాది కౌలుకు దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే భూమికి రూ 7.08 లక్షలు రాగా ప్రస్తుతం వేలం పాటల్లో గతంలో రూ.48 వేలు ఆదాయం పెరిగినట్లు ఈవో వివరించారు. ఈ వేలం పాటల్లో స్థానిక టీడీపీ నాయకులు కే.మురళీధర్ రెడ్డి,బుల్లెట్ రాఘవ రెడ్డిలతో పాటు స్థానిక రైతులు,ఆయా ఆలయల పాలకమండలి సభ్యులు ఆలయ సిబ్బంది శ్రీనివాసులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల విద్యాభివృద్ధి కోసం కృషి

## చంద్రబాబు హయాం లోనే మైనారిటీల సంక్షేమం

**మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**ఎస్ ఎస్ సి, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులకు సన్మానం**



**అమరావతి జూన్ 04**
లిమైనారిటీల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా కృషి చేస్తున్నదని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతి, ఇంటర్ విద్యలో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులను గురువారం మంత్రి సన్మానించి ఆశీర్వదించారు. వెలగపూడి సచివాలయం మూడవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్య తోనే తాము అనుకున్న ఉన్నత స్థాయికి యువత ఎదిగి దేశ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకోగలరని అన్నారు. మైనారిటీ కుటుంబాల్లో విద్యార్థుల శ్రేయోభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటీవలనే వక్ఫ్ బోర్డు ద్వారా తాలిం ఏ హునర్ పథకం క్రింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్ విద్య కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో ప్రతిభగలిగిన 250 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణ, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మైనారిటీల సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీ సూర్య కుమారి, మైనారిటీ కార్పొరేషన్ ఎండి యకూబ్ భాష, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండి శేఖర్, డిడి సరోజినీ, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయునిలో కర్నూలు సివిల్ జడ్జ్ రామకృష్ణయ్య ప్రత్యేక పూజలు..!

**..ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ.**

**..ఆలయ కార్యనిర్వాహన అధికారి ఎం రామకృష్ణ.**



**పాణ్యం/కొత్తూరు జూన్ 4, (రిపబ్లిక్ న్యూస్):-**
ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము నందు కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కె.వి. రామక్రిష్ణయ్య గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంత ఆశీర్వ మంటపము నందు జడ్జి వారికి శాలువాలు, శేష వస్త్రములతో ఘనంగా సత్కరించి ప్రసాదం, స్వామివారి చిత్రపటము, ప్రసాదము అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి కుటుంబ సభ్యులు, సిబ్బంది నాగేశ్వరరావు, పాణ్యం పీసీలు తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com